నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

ఆదిలాబాద్

సోమవారం | ఏప్రిల్ 01, 2024 | www.navatelangana.com

108 వాహనంలో ప్రసవించిన మహిళ

నవతెలంగాణ-జన్నారం



108 వాహనంలో మహిళా ప్రసవించి ఆడ శిశువుకు జన్మనిచ్చిన సంఘటన జన్నారం మండలంలో చోటుచేసుకుంది. 108 వాహన పైలట్ కిషన్ రఫీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం కవ్వాల్ గ్రామానికి చెందిన శ్యామల అనే మహిళా పురిటి నొప్పులతో బాధపడుతుంటే, వారి కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. హుటాహుటిన శ్యామలను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే శ్యామల ప్రసవించి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నారని వాహన సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా శ్యామల కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

భార్య కాపురానికి రావడంలేదని భర్త ఆత్మహత్య

నవతెలంగాణ-వాంకిడి

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సోనాపూర్ గ్రామంలో జరిగింది. ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని సోనాపూర్ గ్రామానికి చెందిన మానికి చెందిన కొడప రాము(25) తల్లి లింగుబాయితో కలిసి ఒకే ఇంటిలో ఉంటూ తల్లి ఆలనపాలన చూసుకొనే వాడు. కొడప రాముకు రెండేళ్ల క్రితం సోనాపూర్ గ్రామానికి చెందిన రమాబాయితో వివాహం జరిగింది. కొన్ని రోజుల నుండి వీరిద్దరి మధ్య గొడవ జరుగుతుండడంతో ఆమె హోళీ పండగకు పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో రాము మద్యానికి బానిసై తాగి వచ్చి తల్లితో గొడవ పడేవాడు. భార్యను తీసుకురావాలని తల్లిని కొడుతుండేవాడు. శనివారం మధ్యాహ్నం రాము చేపలు పట్టడానికి గ్రామస్తులతో కలిసి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి తన భార్య ఇంటికి వెళ్లాడు. రాత్రి అక్కడే భోజనం చేసి పడుకున్నాడు. ఆదివారం తెల్లవారు జామున రాము తన ఇంటికొచ్చి పడుకున్నాడు. తన తల్లి లింగుబాయి ఉదయం లేచిచూసే సరికి రాము తన ఇంటిలో దూలానికి వేలాడుతూ కనిపించాడు. ఎస్ఐ సాగర్ విచారణ చేపట్టి మృతుడి తల్లి లింగుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల సేవలతోనే ప్రశాత వాతవరణం

- జిల్లా ఎస్పీ గౌస్ ఆలం
- ముగ్గురు అధికారుల పదవి విరమణ
- సత్కరించి సాగనంపిన ఎస్పీ గౌస్ ఆలం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు ప్రశాంతంగా జీవనం సాగించడానికి ఒకప్పుటి పోలీసులు చేసిన విశేషమైన కృషినే కారణమని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. ఆదివారం ముగ్గురు అధికారుల పదవీ విరమణ సందర్భంగా స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం జిల్లా ఎస్పీ పాల్గొని పదవీ విరమణ పొందిన అధికారులకు సన్మానించారు. 1989 బ్యాచ్ రూప్ సింగ్ నాయక్, ఏఎస్ఐ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ 1989 బ్యాచ్ రాథోడ్ పరశురాం నాయక్, హెడ్ కానిస్టేబుల్ బేల, 1990 బ్యాచ్ అశోక్, హెడ్ కానిస్టేబుల్ పీసీఆర్ ఈ ముగ్గురికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ కుటుంబ సమేతంగా శాలువా పూలమాలలో సత్కరించి బహుమతి ప్రధానం చేసి, ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో జిల్లా ఎస్పీ సాదరంగా ఇంటికి సాగనంపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అడవుల జిల్లా ఆదిలాబాద్ జిల్లాలో సుదీర్ఘ కాలం పాటు చేసిన సేవలు మరవలేనివని గుర్తు చేశారు. ఒకప్పటి పోలీసు వ్యవస్థలోని సిబ్బంది సంఘవిద్రోహశక్తులతో నిరంతరం పోరాడుతూ ప్రశాంతమైన వాతావరణాన్ని సాధించడానికి కృషి చేశారని తెలియజేశారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబ సభ్యులతో శేష జీవితాన్ని గడపాలని సూచించారు. ఎటువంటి అవసరమైన జిల్లా పోలీసు యంత్రాంగం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఆపరేషన్) బి.సురేందర్రావు, సీసీ దుర్గం శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సభ్యులు గిన్నెల సత్యనారాయణ, చిందం దేవిదాస్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్‌సెర్చ్



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్టు కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు అన్నారు. మండలంలోని కొండపెల్లి గ్రామంలో ఆదివారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహన యజమానులకు వాహన పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రతే పోలీసుల ధ్యేయమని, ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, యువత క్రీడల్లో రాణించాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు వచ్చినట్టయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కోడిపందేలు, గుడుంబా, మట్కా వంటి వాటిని ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెంచికల్‌పేట్, దహెగాం, బెజ్జూరు ఎస్ఐలు చంద్రయ్య, రాజు, విక్రమ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని పంజాబ్ చౌక్ వద్ద టూ టౌన్ పోలీసులు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. టూ టౌన్ సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక పంజాబ్ చౌక్ వైపు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి వాహనాన్ని సైతం తనిఖీ చేశారు. వాహనాన్ని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేయగా.. తనిఖీల సమయంలో పోలీసులకు వారు సహకరించారు. అదే విధంగా రైల్వే స్టేషన్‌లో కూడా తనిఖీలు నిర్వహించారు.

టీఆర్ఈటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాదవరెడ్డి

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రానికి చెందిన గంట్ల మాధవరెడ్డి తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సహాయ కార్యదర్శి అడిచర్ల రాజమల్లు చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షులుగా రవికుమార్, ఉపాధ్యక్షులుగా జగదీశ్వర్, సంయుక్త కార్యదర్శిగా విజయ్ సింగ్, ట్రెజరర్‌గా సత్యనారాయణతో పాటు ముఖ్య సలహాదారుడుగా ఆడిచర్ల రాజమల్లు మనిషా జిల్లా బాధ్యులుగా ఎన్నికైనట్లు తెలిపారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యులుగా బూర్ల భాస్కర్, ఆనందా చారి, చంద్రశేఖర్, శంకర్ లింగంలు ఎన్నికైనట్లు తెలిపారు.

తాగునీటి తాపం తీరేనా..?





- శాశ్వత పరిష్కారం కోసం రూ.6.57కోట్లు మంజూరు
- జిల్లాలో 290 ఆవాస ప్రాంతాల్లో పనులకు శ్రీకారం
- పైప్‌లైన్ లీకేజీలు, బోర్‌వెల్, మోటార్ల బిగింపు
- నెలాఖరు వరకు పూర్తిచేసేందుకు ప్రణాళిక

వేసవిలో తాగునీటి తాపాన్ని తీర్చేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఇందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరుచేసింది. చాలా చోట్ల మిషన్ భగీరథ పథకం పడకేయడంతో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. జనం గొంతు తడిపేందుకు ప్రభుత్వం సత్వర చర్యలకు పూనుకుంది. ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్) కింద నియోజకవర్గానికి రూ.10కోట్లు కేటాయించగా.. ఇందులో ప్రత్యేకంగా తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.కోటి వినియోగించుకోవాలని సూచించింది. ఈ నిధులతో మిషన్ భగీరథ పథకానికి సంబంధించి మరమ్మతులు, పైప్‌లైన్ల లీకేజీలు అరికట్టడం, కొత్తగా బోర్లు వేసి మోటార్లు బిగించడం, అవసరం ఉన్న చోట్ల పైప్‌లైన్లు వేయడం వంటి చర్యలను అధికారులు ప్రారంభించారు. స్థానిక గుత్తేదారులకు పనులకు అప్పగించిన అధికారులు.. ఈ నెలాఖరులోపు పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించారు. అనుకున్నట్లు జరిగితే ఈ వేసవిలో చాలా చోట్ల తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఇంద్రవెల్లి మండలం దుర్వగూడలో బోర్‌లో మోటార్ బిగిస్తున్న దృశ్య

వేసవి కాలం రాగానే ఉమ్మడి జిల్లావాసుల్లో ఆందోళన వ్యక్తమవుతుంటుంది. తాగునీటికి పడరాని పాట్లు పడుతుంటారు. ప్రభుత్వం నాలుగేండ్ల క్రితం మిషన్ భగీరథ పథకాన్ని అందుబాటులోకి తెచ్చినా అంతగా సత్ఫలితాలివ్వడం లేదు. రూ.కోట్లు ఖర్చు చేసి కొండలు, గుట్టల నుంచి పైప్‌లైన్లు వేసి ట్యాంకులు.. సంపులు నిర్మించడంతో పాటు ఇంటింటికి నల్లాలు బిగించారు. కానీ విద్యుత్ సమస్యలతో పాటు సంపుల్లో సాంకేతిక సమస్యల కారణంగా ట్యాంకుల్లోకి నీరు చేరకపోవడం..అక్కడ్నుంచి గ్రామానికి సరఫరా నిలిచిపోవడం వంటి సమస్యలు



బేలలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

ఉత్పన్నమవుతున్నాయి. వీటితో పాటు తరుచూ పైప్‌లైన్ల లీకేజీలు, పగిలిపోవడం కారణం వంటి సమస్యల కారణంగా నీటి సరఫరాలో అంతరాయం కలుగుతోంది. అనేక మారుమూల పల్లెల్లో ఈ పరిస్థితి కనిపిస్తున్నా అధికార యంత్రాంగం దృష్టిసారించడం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడం మూలంగా ఆదివాసీ గిరిజనులతో పాటు మైదాన ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వారి దృష్టికి రావడం లేదు. ఫలితంగా వేసవి రాగానే సమీపంలోని బావులు, చెలిమెలు, చేతిపంపుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. ఈ ఏడాది సైతం ప్రస్తుతం అదే పరిస్థితి పునరావృతమవుతోంది.

నిధులు కేటాయించిన ప్రభుత్వం..!

మిషన్ భగీరథ పథకంలో అనేక సమస్యలు ఉన్నా గత ప్రభుత్వం దృష్టిసారించలేదు. ఫలితంగా ప్రజలు వేసవిలో తీవ్ర తాగునీటి తాపాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ముందుగానే పసిగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తాగునీటి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ఎస్‌డీఎఫ్(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) కింద నియోజకవర్గానికి రూ.10కోట్లు కేటాయించగా.. ఇందులో రూ.కోటి కేవలం తాగునీటికే వినియోగించుకోవాలని సూచించింది. దీంతో ఆదిలాబాద్ జిల్లాలో బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాలతో పాటు ఖానాపూర్ పరిధిలోకి వచ్చే ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాలు, ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని నార్నూర్, గాదిగూడ మండలాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం రూ.6.57కోట్లు మంజూరుచేసింది. ఆదిలాబాద్ జిల్లాలోని 104 జనరల్ ప్రాంతాలు, 51 ఎస్సీ ఆవాస ప్రాంతాలతో పాటు 135 ఎస్టీ ప్రాంతాల్లోని 290చోట్ల పనులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు.

గడువులోపు పూర్తయ్యేనా..?

ఈ వేసవిలో తాగునీటి తాపం ఇప్పటికే మొదలైనా పూర్తిగా నివారించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల ప్రకారం చేపట్టాల్సిన పనులను విభజించి స్థానిక గుత్తేదారులకు అప్పగించారు. పైప్‌లైన్ల మరమ్మతులు, లీకేజీలను అరికట్టడంతో పాటు అవసరమైన చోట్ల కొత్తగా బోర్లు వేసి మోటార్లు బిగిస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులు ఇప్పటికే ఆయా మండలాలు, మారుమూల పల్లెల్లో సమస్యలు ఉన్న ప్రాంతాలను పరిశీలించి నివేదిక రూపొందించారు.వాటిలో పనులు ప్రారంభించారు. ఈ నెలాఖరులోపు పూర్తిచేయాలని అధికారులు నిర్ణయించారు. శాశ్వత ప్రాతిపదికన చేపట్టనున్న ఈ పనుల్లో వేగం పెంచి గడువులోపు పూర్తిచేస్తే ఈ వేసవిలో కొంత వరకైనా తాగునీటి సమస్య తీరేందుకు ఆస్కారం ఉంటుంది.



ఉట్నూర్ మండలం ఎర్రగుట్టలో బోర్ వేయించిన అధికారులు

ఈ నెలాఖరులోపు పూర్తిచేస్తాం

చంద్రమోహన్,ఈఈ, మిషన్ భగీరథ, ఆదిలాబాద్



జిల్లాలో తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను ఇప్పటికే గుర్తించాం. వీటిలో శాశ్వత ప్రతిపాధికన పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. ప్రస్తుతం ఆయా చోట్ల పనులు ప్రారంభమయ్యాయి. కొన్ని చోట్ల బోర్లు వేసి మోటార్లు బిగించాం. పనుల్లో మరింత వేగం పెంచి ఈ నెలాఖరులోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.

ప్రజాపాలనను ఆశీర్వదించండి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- త్యాగాల కుటుంబం ఇందిరమ్మ కుటుంబం
- బీజేపీ శకం ముగిసింది కాంగ్రెస్ ఆట మొదలైంది
- మహిళలకు ప్రాధాన్యత కాంగ్రెస్‌తోనే సాధ్యం
- తెలంగాణ ఇచ్చింది సోనియమ్మ, భారీ మెజార్టీతో ఎంపీ అభ్యర్థిని గెలిపిద్దాం

నవతెలంగాణ-కౌటాల

ప్రజాపాలనను ఆశీర్వదించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనసూయ(సీతక్క) అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జగదాంబ ఫంక్షన్‌హాలులో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ సన్నాహక సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బీజేపీ ఎంపీ అభ్యర్థికి ఓటు ఎందుకు వేయాలన్నారు. బీజేపీ శకం ముగిసిందని కాంగ్రెస్ ఆట మొదలైందన్నారు. ఆదిలాబాద్ పార్లమెంటు పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. బీజేపీ చేసిందేమీలేదని, ఉపాధిహామీ చట్టం ప్రారంభించింది అప్పటి కాంగ్రెస్ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ అని, సోనియాగాంధీ కుటుంబం ఎప్పుడు పదవుల కోసం ఆశించలేదని, దేశాభివృద్ధి కోసం పాటుపడిందని గుర్తు చేశారు. ఉపాధిహామీ చట్టం క్రిందనే సిమెంటు రోడ్లు, రైతువేదికలు, శ్మశానవాటికలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, అదే వంద రోజుల ఉపాధిహామీ చట్టం లేకుంటే ఈ బీజేపీ ప్రభుత్వం ఇవన్నీ ప్రవేశపెట్టేదికాదని ఆమె విమర్శించారు. గాంధీ కుటుంబానికి 34 సంవత్సరాల తర్వాత మళ్లీ ప్రధానమంత్రి అవకాశం వచ్చిందని, రాహుల్‌గాంధీని ఈసారి ప్రధానీ చేయాలన్నారు. బీజేపీ ప్రధానమంత్రి నరేంద్రమోడీ పదేండ్లలో కులాల కొట్లాటలు తెచ్చారని, ఉద్యోగాలు, అభివృద్ధి అడిగితే రాముని అక్షింతలు పంపించాడని విమర్శించారు. దేవుళ్ల పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. దీనిని ప్రజలందరు గమనించి తగిన బుద్ధి చెప్పాలన్నారు. రూ.500లకు ఉన్న గ్యాస్ సిలిండర్ రూ.1200లు చేసిన ఘనత మోడీ సర్కార్‌కే దక్కిందన్నారు. అదానీ అంబానీ రిలియన్స్ జియోల కోసమే పనిచేస్తున్నారన్నారు. రాజీవ్‌గాంధీని చంపిన బాధితుడికి మద్దతు తెలిపి పూజించే పార్టీ బీజేపీ అని, వాళ్లు కాంగ్రెస్‌ను పూర్తిగా నాశనం చేయాలని చూస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలో ఎవరికి కేంద్రం బీజేపీ సాయం చేయాలన్నారు. నల్లదనం తీసుకొస్తానని ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానన్న మోడీ దాని మాట కూడా ఎత్తడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ గల్లీలో కూడా కనిపించదని, దానికి ఓటు వేయడం దండగన్నారు. వైల్డ్ లైఫ్ పేరుతో మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధిని అడ్డుకుంటుందని మండిపడ్డారు. పదేండ్ల పాలనలో ఎన్ని అనుమతులు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. తమకు లొంగలేదని సిటుసోరెల్ వంటి గిరిజన నాయకుడిని జైలుకు పంపిన చరిత్ర బీజేపీదన్నారు. రూ.ఏడు లక్షల కోట్ల అప్పు ఉన్న ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల, రూ.500లకు గ్యాస్ సిలీండర్ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. సుమారు 92 శాతం మందికి రైతుబంధు ఇచ్చామన్నారు. మొన్నటిదాకా నోరుతెరిస్తే బహుజన వాదముంటూ దళితుల పక్షపాతిగా గొప్పలు చెప్పిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇప్పుడు కేసీఆర్ పంచన చేరి కేసీఆర్ పాలన స్వర్ణయుగమని కితాబు ఇవ్వడం నవ్వులాటగా ఉందన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ జెడ్పీ చైర్మెన్

ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జెడ్పీ చైర్మెన్ సిడాం గణపతి తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి సీతక్క వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ పదవులు అడగలేదని, పనుల కోసమే పార్టీలో చేరానని, ప్రజాసేవలో ఎల్లప్పుడు ఉంటూ ప్రజల కోసమే పనిచేస్తానన్నారు. కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి ఆత్రం సుగుణక్కను అత్యధిక మెజార్టీతో చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి భారీ మెజార్టీ తీసుకొచ్చేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

నామినేషన్‌కు యువకుల విరాళం..

సాధారణ కుటుంబం నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుగుణక్కకు మండల యువకులు అండగా నిలిచారు. తమ వంతుగా నామినేషన్ కోసం రూ. మూడే వేలు అందించి తమ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించేల కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

జీపీ కార్మికుల వినతిపత్రం అందజేత...

గ్రామ పంచాయతీ కార్మికులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి సీతక్కకు అందజేశారు. మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని వారికి బరోసా కల్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రాష్ట్రంలో కూడా మన ప్రభుత్వమే ఉందని, మీ ఓటును ఇతర పార్టీ అభ్యర్థులకు వేసి వృథా చేయవద్దని, చేతి గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, చింతలమానెపెల్లి జెడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి, మహిళా మండలాధ్యక్షురాలు బండి శైలజగౌడ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, శ్యాంనాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-జైపూర్



రాబోతున్న లోకసభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకుందామని శ్రీరాంపూర్ సీఐ మోహన్ అన్నారు. భీమారం ఎస్సై రాములుతో కలిసి ఆదివారం తెల్లవారు జామున భీమారం మండల కేంద్రంలో గల ఆవుడం ఎక్స్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. అనంతరం ధర్మారం గ్రామం పంచాయతీ సందర్శించి అక్కడి పోలింగ్ స్టేషన్ పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందుల లేకుండా పరస్పరం సహకరించుకోవాలని కోరారు. ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లాల కుదింపు జోలికి పోకుంటేనే కాంగ్రెస్‌కు మంచిది

నవతెలంగాణ-జన్నారం

జిల్లాల కుదింపు జోలికి పోకుంటేనే కాంగ్రెస్‌కు మంచిదని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర, కార్యదర్శి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య అన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేసిన ప్రతి పనిని సవరించుకుంటూ పోతే ప్రభుత్వానికి తలనొప్పిగా మారుతుందని అన్నారు. గతంలో తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మండల వ్యవస్థ ఏర్పాటు చేసినప్పుడు సామాన్యుని ఇంటికి సేవలు అందాయన్నారు. తెలంగాణ రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పది జిల్లాలు ఉన్నటువంటి తెలంగాణ రాష్ట్రాన్ని 33 జిల్లాలు చేయడం వలన ప్రజలకు చాలా సౌకర్యవంతం ఏర్పడినదన్నారు. దానిని ఇప్పుడు రద్దు చేస్తే రద్దయ్యే జిల్లాల వారు ఉద్యమిస్తే అది రాష్ట్రంలో పెద్ద రభసగా ఏర్పడుతుందన్నారు. ఈ జిల్లాల కుదింపు జోలికి పోకుండా ఉంటేనే కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వానికి మంచిదిని, దీన్ని పరిశీలించి ఉన్నది ఉన్నట్లుగా కొనసాగించాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం రాష్ట్ర నాయకత్వం డిమాండ్ చేస్తున్నామన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | ఏప్రిల్ 01, 2024 | www.navatelangana.com

నిరుపేద విద్యార్థికి చేయూత

నవతెలంగాణ-ముథోల్

హైదరాబాద్‌లోని గోకరాజు రంగరాజు కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న మండలంలోని అష్ట గ్రామానికి చెందిన బొడ్డు గంగాధర్ కుమార్తె కావ్యకి ఉన్నత చదువుల నిమిత్తం లాప్‌ట్యాప్‌ను అదే గ్రామానికి చెందిన పట్టేపూర్ వినోద్‌రెడ్డి అందజేశారు. పట్టుదలతో చదివి తల్లిదండ్రులు కళను నేరవేర్చాలని సూచించారు. లాప్‌ట్యాప్‌ను అందజేసిన దాతను పలువురు అభినందించారు.



బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రధాని నరేంద్ర మోడీ సమర్థ పాలనకు, బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై బీజేపీలో వివిధ పార్టీల నాయకులు చేరుతున్నారని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన దివిటీ రాజు, అనిల్ 40వ వార్డు, నరేందర్, వార్డు నెం 10 నుంచి అశోక్, వివిధ స్థాయి నాయకులు పాయల శంకర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపునకు కృషి చేయాలన్నారు.



పేదింటి ఆడబిడ్డ పెండ్లికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో పేద కుటుంబానికి చెందిన జాదవ్ గణేష్ ఆరు నెలల క్రితం మృతి చెందాడు. ఆయనకు ఇద్దరూ కూతుళ్లు ఉన్నారు. మొదటి కూతురికి పెండ్లి కుదురడంతో ఆదివారం పెండ్లి కూతురు తల్లికి గ్రామ మాజీ సర్పంచ్ రాథోడ్ మధుకర్, ఉప సర్పంచ్ విష్ణు రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రూ.4 వేలు అందించి దాతలు కుటుంబానికి సాయం చేయాలని కోరారు. ఇందులో ఫడ్ రవీందర్, చొలేరాం, బలవంత్, కేంద్రే గణేష్, గుంటే రాజు, మెస్రం ఇర్షవ్ ఉన్నారు.

జిల్లాస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన జిల్లాస్థాయి రెండో విడత కరాటే పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు సరయు, శ్రీనిధి, ఉత్తమ ప్రతిభ కనబరిచి బ్రాంజ్, గోల్డ్ మెడల్ సాధించారు. జిల్లాస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్ సాధించడం పట్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. రాబోయే రోజుల్లో విద్యార్థులు రాష్ట్ర జాతీయస్థాయిలో సైతం రాణించాలని ఆకాంక్షించారు.

గిరిజన కుటుంబాలకు బట్టల పంపిణీ



నవతెలంగాణ-తలమడుగు

శ్రీషిర్డి సాయి సేవా సొసైటీ, సాయి లింగి వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం 2వందల మంది గిరిజన కుటుంబాలకు బట్టలను పంపిణీ చేశారు. సొసైటీ మేనేజర్ మహిళలకు, చీరలు, కోకలు, పురుషులకు ప్యాంటు, షర్ట్స్, చిన్న పిల్లలకు డ్రెస్‌లు, బెడ్‌షీట్స్, బ్లాంకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కిషన్ పటేల్, చందు పటేల్, అవినాష్, ఆత్రం భగవంత్ రావు, చిన్ను పటేల్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో ల్యాండ్ అయిన హెలికాప్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ముఖ్యేడ్ నుంచి ఆదిలాబాద్ మీదుగా పిప్పల్ కోటి వరకు గల రైల్వేలైన్ డబ్లింగ్ పనులు వేగంగా సాగుతున్నాయి. నెలరోజుల క్రితం డబ్లింగ్ పనులు ప్రారంభించగా ఆదివారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు పనుల పురోగతిని పరిశీలించేందుకు ఏరియల్ సర్వే చేపట్టారు. నాందేడ్ డివిజన్‌కు చెందిన డిప్యూటి చీఫ్ ఇంజనీర్ ప్రకాష్ ప్రతాప్, అసిస్టెంట్ ఇంజనీర్ దినేష్ చౌదరిలు ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో రైల్వే పనులు కొనసాగుతున్న ప్రాంతాల పురోగతిని పనులను పర్యవేక్షించారు. ఇక్కడ కొనసాగుతున్న పనుల పురోగతిని సైట్ ఇంజనీర్ సుబ్బారావ్ వారికి వివరించారు. ఆదిలాబాద్ నుంచి పిప్పల్ కోటి వరకు కొనసాగుతున్న పనులను పరిశీలిస్తున్న సందర్భంలో హెలిక్యాప్టర్‌లో ఇంధనం అయిపోవడంతో వారు స్థానిక విమానాశ్రయ మైదానంలో వేచి చూడాల్సి వచ్చింది. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో ఇంధనం తీసుకువచ్చి హెలిక్యాప్టర్లో నింపుకొని తిరిగి యదావిధిగా ఏరియల్ సర్వే నిర్వహించి పనుల గురించి తెలుసుకున్నారు. పనులు త్వరితగతిన నాణ్యతతో పూర్తిచేసేలా పనుల్లోవేగం పెంచాలని ఇంజనీరింగ్ అధికారులు సైట్ ఇంజనీర్ సుబ్బారావును ఆదేశించారు.

డిగ్రీ పరీక్ష ఫీజు గడువు పొడగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లింపు తేదీని పొడగించినట్టు కాకతీయ యూనివర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డా.తిరుమలదేవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 31వ తేదీ వరకు ఉన్న గడువును పొడగించారు. ఏలాంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 4 వరకు చెల్లించవచ్చన్నారు. రూ.50తో అపరాధ రుసుముతో ఏప్రిల్ 16 వరకు పెంచినట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డిగ్రీ విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి సకాలంలో ఫీజు చెల్లించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్ సూచించారు.

చండీయాగం పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



విశ్వశాంతి లోకకళ్యాణాన్ని కాంక్షిస్తూ పట్టణంలోని దుర్గానగర్ నవశక్తి దుర్గామాత ఆలయంలో ఏప్రిల్ 11 నుంచి 14వ తేది వరకు చైత్ర నవరాత్రుల్లో భాగంగా రుద్రసహిత శతచండి విశ్వశాంతి మహాయాగం నిర్వహిస్తున్నట్లు దుర్గాపీఠం పీఠాదిపతి, దుర్గామాత ఉపాసకుడు కిషన్ మహారాజ్ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆలయంలో చండీయాగానికి సంబంధించిన పోస్టర్లను భక్తులతో కలిసి విడుదలచేశారు. ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 11న పట్టణంలో 108 కళాశాలతో భక్తులతో శోభాయాత్ర ఏప్రిల్ 12 నుంచి 14 వరకు 108 హోమకుండలతో శతచండి యాగం నిర్వహించబడుతుందని తెలిపారు. వీటితో పాటు మూడు రోజుల పాటు ఆలయంలో అమ్మవారికి లక్ష కుంకుమార్చన, పుష్పార్చన, దీపార్చన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలియజేశారు. విశ్వశాంతి కోసం చేపట్టే ఈ హోమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-ఉట్నూర్

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అథితిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధితో పాటు పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందన్నారు. గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత కరెంటుతో పాటు రూ.500లకే గ్యాస్ అందిస్తున్నామని తెలిపారు. నర్సాపూర్(జె), నర్సాపూర్(బి)గ్రామాల్లో త్వరలో ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో గ్రామగ్రామాన తిరిగి సమస్యలు తెలుసుకుని, పరిష్కారం కోసం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. అనంతరం బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాగా వారికి కండువా కప్పి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య, టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మోబిన్, మాజీ సర్పంచ్ భీమన్న, గ్రామ అధ్యక్షుడు షరీఫ్, అర్బాజ్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం జోలికొస్తే ఖబడ్దార్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వం జోలికొస్తే ఖబడ్దార్ అంటూ ఆ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించుకునేందుకు ఏప్రిల్ 1న జిల్లాకేంద్రంలోని రత్నా గార్డెన్‌లో నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్క హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కారు పార్టీ పూర్తిగా ఖాళీ కావడం ఖాయమని ఎద్దేవా చేశారు. ఆదివాసీ బిడ్డ ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి-వెంకట్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాషద్ ఉల్‌హక్, బైన్‌వార్ గంగారెడ్డి పాల్గొన్నారు.

టోల్ ప్లాజా కార్మికులని ఎన్‌హెచ్ఏఐ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

నవతెలంగాణ-నేరడిగొండ

టోల్ ప్లాజా కార్మికులందరిని ఎన్‌హెచ్ఏఐ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రోల్‌మామడ టోల్ ప్లాజా కాంప్లెక్స్‌లో టోల్ ప్లాజా యూనియన్ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. టోల్ ప్లాజాల్లో పనిచేస్తున్న సిబ్బందిని నేసనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్‌హెచ్ఏఐ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ, ఉద్యోగ భద్రత కల్పించాకే (టీఓటీ) టోల్ ఆపరేటింగ్ ట్రాన్స్‌ఫర్స్ పద్ధతిని అమలు చేయాలన్నారు. సిబ్బందికి కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 8న నిర్వహించిన టోల్ ప్లాజా యూనియన్ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, టోల్ ప్లాజా యూనియన్ అధ్యక్షులు నక్క లక్ష్మణ్, నాయకులు పవార్ జితేందర్, గోవింద్ సింగ్, చంద్రశేఖర్, గంగాధర్‌లు పాల్గొన్నారు.



బాధిత కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్పీ పరామర్శ

- రూ. 2.5 లక్షల విలువ చేసే చెక్కుల అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహాశివరాత్రి సందర్భంగా నేరడిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంటాల జలపాతంలో విధులలో ఉండగా గుండెపోటుతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ కే.మార్కండేయ కుటుంబ సభ్యులను జిల్లా ఎస్పీ గౌష్ ఆలం పరామర్శించారు. ఆదివారం గుడిహత్నూర్ మండలం సీతాగొంది గ్రామంలోని మార్కండేయ స్వగృహంలో జిల్లా ఎస్పీ మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 2000 మిలీనియం కానిస్టేబుల్ బ్యాచ్ అసోసియేషన్ ద్వారా రూ. రెండు లక్షల చెక్కును, ఆదిలాబాద్ జిల్లా వెల్ఫేర్ అసోసియేషన్ తరపున రూ.50 వేల చెక్కును జిల్లా ఎస్పీ మార్కండేయ భార్య కె సుజాత, కొడుకు కే.నిఖిల్‌కు అందించారు. ప్రభుత్వపరంగా అందించే లబ్ధి త్వరగా చేకూరే విధంగా చూడాలని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన 2000 బ్యాచ్ కానిస్టేబుల్స్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, బి రవి, సుభాష్, ప్రేమ్, సంపత్, ధర్మపాల్, శ్రీనివాస్, రమేష్, చిందం దేవిదాస్, డి.శివన్న పాల్గొన్నారు.

పూలే దంపతుల విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలో ఆదివారం జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహ ఏర్పాటు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. పూలే ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. పూలే దంపతుల జీవిత చరిత్ర రాబోయే తరాలకు ఆదర్శం కావాలన్న ఉద్దేశంతో ముథోల్‌లో విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేయడం జరిగిందని పేర్కొన్నారు. త్వరలో అందరి సహకారంతో విగ్రహ ప్రారంభోత్సవం కూడా నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎజాజ్‌ఉద్దిన్, ఎంపీటీసీ దేవోజి భూమేష్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, మాజీ సర్పంచులు రాజేందర్, అనిల్, విగ్రహ కమిటీ అధ్యక్షుడు పోతన్న యాదవ్, కమిటీ సభ్యులు, నాయకులు గుంజల నారాయణ, ఖాలిద్ పటేల్, తాటివార్ రమేష్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ సంజీవ్, రిజ్వాన్, క్యాషియర్ మంత్రి సాయన్న, విశ్వంభర్ జోంధాలే, రాహుల్, గ్రామస్తులు పాల్గొన్నారు.



దాహం తీర్చిన ఎమ్మెల్యే



నవతెలంగాణ ఉట్నూర్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అమలు చేస్తున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌లో ఇచ్చిన హామీ ప్రకారం నీటి సమస్యను దృష్టిలో పెట్టుకొని బోర్ వేయించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు అబ్దుల్ ఖయ్యుమ్ మాట్లాడుతూ ప్రజలకు నీటి సమస్యలు లేకుండా చూడటమే పార్టీ లక్ష్యమని అన్నారు. ఎలాంటి సమస్యలున్న నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకోని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలున్నారు.

ఉచిత శిక్షణకు స్పాట్ ద్వారా అడ్మిషన్లు

నవతెలంగాన-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణకు స్పాట్ అడ్మిషన్ల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సునీత కుమారి, ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ డా. రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రి పాస్ అయిన నిరుద్యోగ ఎస్సీ యువత ఏప్రిల్ 1, 2 తేదీలలో స్టడీ సర్కిల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆదిలాబాద్ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఎండ తీవ్రతంగా ఉందని ప్రయాణికులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ స్టేషన్ మేనేజర్ కృష్ణ, రిజర్వేషన్ ఇన్‌చార్జి హుస్సేన్, లయన్స్ క్లబ్ సభ్యులు అన్వర్, మధుసూదన్ రావు, రమాకాంత్ రావు, విశ్వాస్, నరేందర్, సత్యనారాయణ ఉన్నారు.

నీలాబాయి సేవలు మరువలేనివి

- జెడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్



నవతెలంగాణ-నార్నూర్

రాథోడ్ నీలాబాయి సేవలు మరువలేనివనీ జెడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. ఆదివారం తాడిహత్నూర్ గ్రామంలో నిర్వహించిన నిలాబాయి పెద్దకర్మ(తేరివి) కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎంపీటీసీగా మంచి సేవలు అందించిందన్నారు. ముందుగా నిలాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి పరామర్శించారు. ఇందులో నాయకులు శ్రీరాం నాయక్, నారాయణ్ నాయక్, సురేష్ నాయక్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, మాజీ సర్పంచులు బానోత్ గజానంద్ నాయక్, మధుకర్ రాథోడ్, రెడ్డి నాయక్, ఫ్యాక్స్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడే, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేష్ పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ ఫలితాల్లో సత్తా చాటిన నాగభూషణం విద్యార్థులు




నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని నాగభూషణం విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. నాగభూషణం మెమోరియల్ స్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు మండల కేంద్రానికి చెందిన భైరి సహస్ర, హరి ప్రసాద్‌లు ఇటీవల వెలువడిన నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. అలాగే ఇటీవల వెలువడిన సైనిక్ స్కూల్‌లోని ప్రవేశ ఫలితాల్లో కూడా భైరీ సహస్ర కూడా ఎంపిక అవడం జరిగిందన్నారు. అలాగే ఇలా ప్రవేశ ఫలితాల్లో సత్తా చాటినందుకు తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | ఏప్రిల్ 01, 2024 | www.navatelangana.com

నియోజకవర్గం అధ్యక్షునికి ఘన సన్మానం

నవతెలంగాణ-జైపూర్



జై భీమ్ సేవాదళ్ చెన్నూర్ నియోజకవర్గం అధ్యక్షునిగా నియమితులైన శీలం వెంకటేశంను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మండలానికి చెందిన వెంకటేశం నియోజకవర్గం అధ్యక్షులుగా ఎన్నికైనందుకు అభినందిస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాజీ మండల పరిషత్ అధ్యక్షులు జాడి యేసయ్య, జైపూర్ మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి కలికి రమేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బానేష్, పద్మశాలి కుల సంఘం మండల ఉపాధ్యక్షుడు భూమయ్య శాలువాలతో ఘనంగా సన్మానించారు.

చొప్పరిపల్లి చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు

నవతెలంగాణ-కాసిపేట



కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం చొప్పరిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వద్ద మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎటువంటి ఆధారాలు లేకుండా గోదావరిఖనికి చెందిన అల్లివర్ అర్జున్ వద్ద రూ.98500 నగదు తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసిన నగుదును తదుపరి చర్యల నిమిత్తం ఎస్ఎస్టీ టీంకు అప్పగించినట్లు సీఐ శశిధర్ రెడ్డి వివరించారు.

తల్లిదండ్రులు తమ పిల్లలకు నైతిక విలువలు నేర్పాలి



నవతెలంగాణ-జన్నారం

తమ పిల్లలకు తల్లిదండ్రులు నైతిక విలువలు నేర్పాలని, మండలంలోని స్లేట్ ప్రయివేట్ పాఠశాల ప్రిన్సిపల్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్లేట్ ఎక్సలెన్స్ స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు నైతిక విలువలు ఎలా పెంపొందించాలని అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్లేట్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మనం నిత్యజీవితంలో ఎలా జీవించాలి. ఎలాంటి నైతిక విలువలు కలిగి ఉండాలని దీనివల్లా మన పిల్లలు కూడా మనల్ని అనుసరిస్తూ భవిష్యత్తులో వారు కూడా నైతిక విలువలను తెలుసుకుంటూ భవిష్యత్తులో మంచి విద్యార్థులుగా తయారవుతారు. వారు అనుకున్న స్థాయిలో చేరుకోవడం జరుగుతుంది. కాబట్టి ఈ నైతిక విలువలు అనేటివి చిన్నప్పటి నుండి పిల్లలకు నేర్పించడంలో తల్లిదండ్రుల పాత్ర చాలా ముఖ్యమైనదని అన్నారు. ప్రతి ఒక్క తల్లిదండ్రులు ఈ నైతిక విలువలను పాటిస్తూ భవిష్యత్తులో మంచి తల్లిదండ్రులుగా ఎదగాలని కోరుకుంటున్నామన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో 300 మంది విద్యార్థుల తల్లిదండ్రులు, స్లేట్ స్కూల్ అడ్మినిస్ట్రేటర్ ఏనుగు రజిత రెడ్డి, స్లేట్ ఎక్సలెన్స్ ప్రిన్సిపల్ మరియా, ఉపాధ్యాయులు కృష్ణ, దిలీప్, కార్తీక్, అనూష, మహేశ్వరి, రమ్య లావణ్య, సమీన పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు ఎమ్మెల్యే ఆహ్వానం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపాన ఉన్న పవిత్ర గోదావరి నది ఒడ్డున వెలసిన శ్రీ చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో, నిర్వహిస్తున్న శ్రీరామనవమికి హాజరు కావాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ్మా బొజ్జు పటేల్ కు ఆదివారం అలాగే కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రాన్ని ఇచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఆలయ అభివృద్ధికి రూ.10 వేల సహాయాన్ని అందించారు. తప్పనిసరిగా శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొంటారని, హామీ ఇచ్చినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కమ్మల భూమయ్య, కమ్మల గంగయ్య, గోవా భూమయ్య, నాడెం శ్రీనివాస్, కూకటికారి శ్రీనివాస్, మైలారపు భాస్కర్, గుగులావత్ రవి, శ్రీనివాస్, స్వామి దాస్, శంకరయ్య కొమురయ్య పాల్గొన్నారు.

ఘనంగా క్రైస్తవుల ఈస్టర్ పండుగ



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఏసుక్రీస్తు మరణాన్ని జయించి మూడో రోజు తిరిగి పునరుత్థానం అయిన రోజుగా క్రైస్తవులు జరుపుకునే ఈస్టర్ పండుగను ఆదివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక సెయింట్ పీటర్స్ చర్చిలో ఏసుక్రీస్తు పునరుత్థాన పండుగ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ భక్తులు కొవ్వొత్తులను వెలిగించి యేసును స్తుతించారు. అనంతరం చర్చిలోనూ యేసును స్మరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాస్టర్ శ్యామ్యూల్ ఈ సందర్భంగా పాపుల పాపాలను మోసేందుకు శిలువను ధరించిన యేసు పరలోకము నుంచి తిరిగి మూడో రోజు పునరుత్థానుడైన తీరును తెలిపారు. మనిషికి దైవంతో ఉన్న సంబంధం, సమాజంతో ఉన్న బాంధవ్యం, విశ్వవ్యాప్త ప్రేమ, సర్వకాలిన జీవన విధానం ఏసు ప్రభోధనలో కనిపిస్తాయని ఉద్బోధించారు. న్యాయంగా ధర్మంగా జీవించడానికి అందరి సంక్షేమానికి ఏసు ఇచ్చిన సందేశం చిరస్మరణీయమని పేర్కొన్నారు. సత్యాన్ని అంతం చేయాలని ప్రయత్నించిన ప్రతి సారి అది ఏదో ఒక రూపంలో తిరిగి ఉద్భవిస్తుందన్న సత్యాన్ని యేసు పునరుత్థానం తెలియజేస్తోందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

అదిలాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు అయినట్లు ఎస్ఐ ముజాహిద్ తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొనగా ఒకరికి తీవ్ర గాయాలు కాగా వారిని వెంటనే 108 వాహనంలో రిమ్స్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎఫ్‌సీఐ నుండి

మళ్లీ సీసీఎస్‌కు బియ్యం సరఫరా

- రైస్ మిల్లర్ల లాబీయింగే కారణమా..?
- పెద్ద ఎత్తున ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతున్న విషయం అందరికీ తెల్సిందే. ఈ బియ్యం అక్రమ దందాను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైస్ మిల్లర్లు సరఫరా చేసే బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ(సీసీఎస్)కు కాకుండా ఎఫ్‌సీఐకి అప్పగించాలని రెండు నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఎఫ్‌సీఐ నిబంధనల ప్రకారం రైస్ మిల్లర్లు బియ్యం సరఫరా చేస్తే అవినీతికి అడ్డుకట్ట పడ్డట్లే. కాని మళ్లీ పౌరసరఫరా శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ వారం రోజుల క్రితం ఈ ఉత్తర్వులను సవరించి మళ్లీ సీసీఎస్‌కు బియ్యం సరఫరా చేయాలని ఆదేశించడం అవినీతికి ఆస్కారం కల్పించడమేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 20 రైస్ మిల్లులు ఉన్నాయి. ఈ రైస్ మిల్లులకు ప్రతీ ఏటా రెండు సీజన్లలో ప్రభుత్వం వరి ధాన్యం కేటాయిస్తుంది. ప్రభుత్వం క్వింటాలు వరి ధాన్యం కేటాయిస్తే అందులో 67 కిలోల బియ్యం రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సరఫరా చేయాలి. ప్రస్తుతం జిల్లాలోని రైస్ మిల్లర్ల వద్ద 2022-23కు సంబంధించి రబీ ధాన్యంతో పాటు 2023-24కు సంబంధించి ఖరీఫ్ ధాన్యం నిల్వలు ఉన్నాయి. వాస్తవానికి ప్రభుత్వం వరి ధాన్యం కేటాయించిన ఆరు నెలల్లో రైస్ మిల్లర్లు బియ్యం సరఫరా చేయాలి. కాని రైస్ మిల్లర్ల ఉదాసీనత, అధికారుల పట్టింపు లేనితనం కారణంగా ఏ సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కూడా సకాలంలో పౌరసరఫరాల శాఖకు చేరడం లేదు. ప్రస్తుతం 2022-23 రబీ ధాన్యం 20,976 క్వింటాళ్లు, 2023-24 ఖరీఫ్ ధాన్యం 6,140 క్వింటాళ్లు ఇప్పటికీ రైస్ మిల్లర్ల వద్దే ఉన్నట్లు రికార్డులు చెపుతున్నాయి.

15 శాతానికి మించని బియ్యం సరఫరా

జిల్లాలోని 20 రైస్ మిల్లులకు 2022-23 రబీ సీజన్‌లో ప్రభుత్వం 24,197 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కేటాయించింది. ఇందులో నుండి రైస్ మిల్లర్లు 16,212 క్వింటాళ్ల బియ్యాన్ని సరఫరా చేయాలి. ఈ ఏడాది ఫిబ్రవరి 29వ తేదీ వరకు మిల్లర్లు బియ్యాన్ని సరఫరా చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. కాని గడువు తేదీ వరకు కేవలం 10.55 శాతం మాత్రమే బియ్యం సరఫరా జరిగింది. దీనితో మళ్లీ మే 15వ తేదీ వరకు గడువు పెంచారు. అదే సమయంలో బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు కాకుండా ఎఫ్‌సీఐకి సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కేంద్ర పర్యవేక్షణలో ఉండే ఎఫ్‌సీఐ నిబంధనల మేరకు బియ్యం సరఫరా చేయాలంటే మిల్లర్లు అష్టకష్టాలు పడాల్సిందే. రాష్ట్ర పర్యవేక్షణలో ఉండే సీసీఎస్‌కు బియ్యం సరఫరాకే మిల్లర్లు మొగ్గు చూపుతారు. కాని ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరా చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఉత్తర్వులు వెలువడడంతో రైస్ మిల్లర్లకు పాలుపోని పరిస్థితి ఏర్పడింది. అధికారుల ఒత్తిళ్ల మేరకు ఈ నెల రోజుల వ్యవధిలో కేవలం 5 శాతం మాత్రమే బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సరఫరా చేశారు. ఈ నెల 27వ తేదీ వరకు 20 రైస్ మిల్లుల నుండి 15.02 శాతం బియ్యం మాత్రమే సరఫరా జరిగింది. ఇంకా 13,777 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేయాల్సి ఉంది. ఇది కేవలం 2022-23 రబీ సీజన్‌కు సంబంధించింది మాత్రమే. 2023-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైస్ మిల్లులకు 6,140 క్వింటాళ్ల ధాన్యం కేటాయిస్తే, మిల్లర్లు 4,113 క్వింటాళ్ల బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉంది. ఇందులో నుండి ఒక్క క్వింటాలు కూడా ఇప్పటి వరకు బియ్యం సరఫరా జరగలేదు.

బియ్యం లేవు.. ధాన్యమూ లేదు....


ఇటు పౌరసరఫరాల శాఖకు బియ్యం సరఫరా కాలేదు. అటు రైస్ మిల్లులలో వరి ధాన్యం లేదు. మరి ఇవన్నీ ఎక్కడ మాయమయ్యాయి. గత ఫిబ్రవరి నెలలో సిర్పూరు (టి) మండలంలోని రెండు రైస్ మిల్లులలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించగా కోట్లాది రూపాయల వరి ధాన్యం పక్కదారి పట్టినట్లు వెల్లడైంది. వేంపల్లిలోని ఒక రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహిస్తే 36,091 బస్తాల వరి ధాన్యం లేదు. ఇదే మండలం వెంకట్‌రావుపేట మిల్లులో తనిఖీలు చేపడితే ఏకంగా 5.90 కోట్ల విలువైన 69,394 బస్తాల వరి ధాన్యం లేదు. ఇటు మిల్లులలో వరిధాన్యం లేక, అటు పౌరసరఫరాల శాఖకు బియ్యం సరఫరా కాకపోవడం అవినీతిని బహిర్గతం చేస్తోంది.

మంచిర్యాల జిల్లాకు చెందిన ఎమ్మెల్యేతో లాబీయింగ్?

ఎఫ్‌సీఐ నుండి సీసీఎస్‌కు బియ్యం సరఫరా ఉత్తర్వుల జారీ కోసం జిల్లాలోని రైస్ మిల్లర్లు పక్కనే ఉన్న మంచిర్యాల జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేతో లాబీయింగ్ జరిపినట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో పాత ఉత్తర్వుల ప్రకారం ఎఫ్‌సీఐకే బియ్యం సరఫరా చేస్తుండగా, ఒక్క కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మాత్రం సీసీఎస్‌కు బియ్యం సరఫరా చేసేలా ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడడం వెనుక అంతరార్థం ఏమిటోననే చర్చ కొనసాగుతోంది. రేషన్ బియ్యం కొనుగోలు చేసి రీ సైక్లింగ్ చేసి మళ్లీ ఆ బియ్యాన్నే సీసీఎస్‌కు సరఫరా చేస్తున్నారని జిల్లాలోని రైస్ మిల్లర్ల మీద గతం నుండే ఆరోపణలున్నాయి. ఈ ఉత్తర్వుల సడలింపు కోసం పై స్థాయిలో పెద్ద ఎత్తున ముడుపులు ముట్టచెప్పినట్లు తెలుస్తోంది. దీనిపై పౌరసరఫరాల శాఖ అధికారులను సంప్రదించే ప్రయత్నం చేయగా వారు ఎవరూ అందుబాటులోకి రాలేదు.



గత ఫిబ్రవరి నెలలో సిర్పూరు మండలం వెంకట్‌రావుపేట రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు (ఫైల్)



GOVERNMENT OF TELANGANA
CIVIL SUPPLIES DEPARTMENT

CCS.Ref.No.P(I)/38/2023 Dated:21.03.2024

PROCEEDINGS NO.167/ KMS 2022-23
Present: Sri. D.S. Chauhan I.P.S.,
Commissioner of Civil Supplies

Sub:- Civil Supplies – Procurement of paddy- Rabi 2022-23 & Kharif 2023-24- Request of the Collector (CS), Asifabad for allotment of Raw Rice to CSC-Orders issued- Reg.

Read:- 1. CCS. Proc. No. 118/ KMS 2022-23, Dt: 31.10.2023
2. CCS. Proc. No. 122-A/ KMS 2022-23, Dt: 18.11.2023
3. CCS. Ref. No. 38/ KMS 2022-23, Dt:20.03.2024
4. Collector(CS), Asifabad, Lr.No.DCSOKB/CS-2/203/1/2023, Dt:21.03.2024

*****

ORDER:

In the reference 4th read above, the Collector (CS), Asifabad has requested to allot 24197 MTs of Rabi 2022-23 paddy and 6140 MTs of Kharif 2022-23 paddy for delivering Raw Rice to CSC instead of FCI, to avoid transportation charges for shifting of Rice from other districts to meet the PDS requirement of Asifabad district.

On examination of the request, it has been observed that, the Collector (CS) has requested for allotment of Raw Rice to CSC to the entire quantity i.e. 24197 MTs of paddy procured in Rabi 2022-23. But, the district has milled and delivered a quantity of 3,221 of Paddy (equivalent CMR of 2175 MTs) to FCI.

Therefore, in order to meet the Raw rice requirement of Asifabad district under PDS, the request of the Collector (CS) Asifabad is considered and a total quantity of 27,116 MTs i.e. Rabi 2022-23 (20976 MTs) and Kharif 2023-24 paddy (6140 MTs) is allotted for delivering Raw Rice to CSC instead of FCI duly modifying the orders issued vide reference 1st & 2nd read above as detailed below.

(Paddy in MTs)

RABI 2022-23						
Paddy allotted			Paddy now allotted for delivering Raw Rice to CSC duly reducing Sannabiyyam/ FCI allotment	Revised Paddy allotment		
Sanna biyyam	FCI Raw	FCI Boiled		CSC	FCI Raw	FCI Boiled
4806	9278	10113	20,976	20976	1515	1706
Kharif 2023-24						
0	6140	0	6140	6140	0	0

The Collector (CS), Asifabad district is directed to revise the allotment of paddy for Rabi 2022-23 & Kharif 2023-24 and also to effect necessary corrections in OPMS and to ensure that the CMR is delivered to CSC within the stipulated time given by Government.

(Contd....)

ఎఫ్‌సీఐ నుండి సీసీఎస్‌కు బియ్యం సరఫరాకు అనుమతిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల కాపీ

ఈ నెల 27 వరకు సరఫరా అయిన బియ్యం వివరాలు (క్వింటాళ్లలో)

	కేటాయించిన ధాన్యం	సరఫరా చేయాల్సిన బియ్యం	సరఫరా చేసిన బియ్య	శాతం
(2022-23 రబీ)	24,197	16,212	2,435	15,02
(2023-24 ఖరీఫ్)	6,140	4,113	0.000	0.00

అనాధలైన పిల్లలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పట్టణానికి చెందిన ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాధలైన పిల్లలకు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. మందమర్రి పట్టణంలోని రెండో జోన్‌లో నివాసం ఉంటున్న పిట్టల శ్యామ్, భూమక్క దంపతులు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆరు నెలల క్రితం మంచిర్యాలలో సెంట్రింగ్ పని చేస్తూ భవనంపై నుంచి కింద పడి శ్యామ్ మరణించారు. భార్య భూమక్క మెదడులో కణితి ఉండడంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో 15 రోజుల క్రితం శస్త్ర చికిత్స చేయించి తొలగించారు. ఆరోగ్య పరిస్థితి బాగాలేక గురువారం ఆమె కూడా చనిపోయారు. తల్లిదండ్రులు చనిపోవడంతో వారి పిల్లలు అయిన హృతిక్(6), కార్తిక్(4)లు అనాధలయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వారిని పరామర్శించి రూ.20,000 వేల చెక్ రూపంలో ఆర్థిక సాయం అందించారు. ట్రస్ట్ అధ్యక్షులు బి.లక్ష్మణ్ మాట్లాడుతూ ఎవరైన దాతలు ముందుకు వచ్చి చిన్నారులను ఆదుకోవాలని కోరారు. పేదలకు, అనాధలకు, ఆపదలో ఉన్న వారికి, చదువుకునే వాళ్లను ప్రోత్సహించడంలో మా సంస్థ ద్వారా సేవాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి టి.సురేష్, ప్రచార కార్యదర్శి శరత్ బాబు, సభ్యులు ఎస్.మహేందర్, బి.సంపత్, ఇ.వెంకటేష్, సీహెచ్ అశోక్, జనార్ధన్ పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు




నవతెలంగాణ-మందమర్రి

సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుండే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసారు. గుడ్ ఫ్రైడే సిలువ త్యాగ మరణం పొందిన ఏసుక్రీస్తు మూడో రోజు ఆదివారం సజీవుడై లేచిన దినమునే ఈస్టర్ పర్వదినమని సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవ జెర్మియా అన్నారు. సీఎస్ఐ చర్చిలో ఉదయం 4 గంటలకు సిలువ వెలుగింపు కార్యక్రమాన్ని ఉమెన్స్ ప్రెసిడెంట్ సంధ్యతో కలిసి, ఉమెన్స్ సెక్రెటరీ రీటారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ రెవజెర్మియా సందేశమిస్తూ పాపుల రక్షణార్థం ఏసుక్రీస్తు సిలువ మోసి తన రక్తాన్ని చిందించి ఈ లోకాన్ని శుద్ధి చేసేందుకు రక్షణగా నిలిచారన్నారు. ఏసుక్రీస్తు ముప్పై మూడున్నర ఏళ్ల ఈ లోకంలో మనుషుల మధ్య జీవించి అనేక మహిమలు, అద్భుతాలు చేశారని గుర్తుచేశారు. ఈ వేడుకలు ప్రతి ఇంటిలో శాంతి సంతోషాన్ని నింపాలన్నారు.

ఇసుక మాఫియాను అరికట్టండి

- డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని ఇంద్రానగర్ గ్రామపంచాయతీలో లేతనుగూడా వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని, దీన్ని అరికట్టాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చపిడి పురుషోత్తం అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ లారీలలో వేరే జిల్లాలకు ఇసుక రవాణా యదేచ్ఛగా నడుపుతున్నట్లు తెలిపారు. అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇసుక మాఫియా రెబ్బెన మండలంలో రెచ్చిపోతున్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మైనింగ్ ఏఈకు ఫోన్ చేస్తే తాము ఎన్నికలల్లో బీజీగా ఉన్నామని, రాలేమని చెబుతున్నారన్నారు. మండలంలో ప్రభుత్వ ఆదాయానికి గండికోడుతూ కొన్ని వందల ట్రాక్టర్ల ఇసుకలు తరలిస్తున్నారన్నారు. ఇసుక మాఫియాతో పాటు పక్కనే ఉన్న చాపిడి భీమ్‌రావు అనే రైతు చేన్‌లోని టేకు చెట్లను నరికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. పదేండ్లుగా పెంచుతున్న చెట్లను కొట్టి లారీలో తీసుకెళ్లారని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. టేకు చెట్లను నరికి తీసుకెళ్లిన వారిని గుర్తించి నష్టపరిహారంగా రూ.50వేలు ఇప్పించి క్రిమినల్ కేసు వేయాలని ఆయన డిమాండ్ చేశారు

కాంగ్రెస్‌లో చేరిన టీబీజీకేఎస్ మాజీ ఉపాధ్యక్షుడు

నవతెలంగాణ-రెబ్బెన

కొమురం భీం జిల్లా రెబ్బెన మండలంలోని బెల్లంపల్లి ఏరియా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం టీబీజీకేఎస్ మాజీ ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసూరి అనసూయ(సీతక్క) కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సదాశివ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, ఇచ్చిన మాట ప్రకారం సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించారని తెలిపారు. అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట మండల నాయకులు రవీందర్, తిరుపతి, రహీం, సుబ్బారావు పాల్గొన్నారు